**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

పగలురేయి కలిసి పరిపూర్ణ దినమండ్రు
ప్రకృతిచక్రమందు వరుసజూడ
కష్టసుఖములున్న కలిసి సంపూర్ణంబు
మనిషిజీవితమున మహిమనిదియె

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 44 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 23-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# లక్నోలో భారీ అగ్నిప్రమాదం

**మంటల తీవ్రతకు 14 మంది విద్యార్థులు మృతి**

- బిల్డింగ్ పైనుంచి దూకిన పలువురు విద్యార్థులు
- రంగంలోకి 8 ఫైర్ ఇంజన్లు.. ముమ్మర సహాయక చర్యలు
- స్పందించిన సీఎం యోగి.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం
- ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి.. మృతులకు సంతాపం
- మృతుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- ఘటనపై సమగ్ర విచారణకు డీజీపీకి సీఎం ఆదేశం

**లక్నో ,జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్ జిల్లా పూర్నియా ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో కోచింగ్ సెంటర్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో లోపల ఉన్న విద్యార్థులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌తో పాటు పలు దుకాణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ఐదుగురు నుంచి



-మిగతా 2 లో



## అమెరికాకు షాకిచ్చిన చైనా

- పది సైనిక కంపెనీలపై ఆంక్షలు
- సివిల్, మిలిటరీ వస్తువుల ఎగుమతిపై నిషేధం
- 46 అమెరికా సంస్థల కొనుగోళ్లకు బ్రేక్
- థర్డ్ పార్టీ బదిలీలపై చైనా ఆంక్షలు
- చైనా టెక్ కంపెనీలపై అమెరికా గురి
- ట్రంప్, జిన్‌పింగ్ చర్చల వృథా
- ఇరు దేశాల మధ్య ముదిరిన వాణిజ్య యుద్ధం

**బీజింగ్, ,**
అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు

-మిగతా 2 లో

### ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి

# సహకరిస్తాం

**కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ**

- భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు తదితర అంశాలపై చర్చ
- ఎమ్ఆర్వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేయాలని వినతి
- ‘గాంధీ సరోవర్ ప్రాజెక్టు’ నిర్మాణానికి సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు



2






## ఫేక్ ప్రచారాలకు చెక్ పెట్టండి

- కులా, మత రంగులు పులిమి వివాదాలు సృష్టిస్తున్నారు
- ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ తప్పుడు ప్రచారం
- ప్రజా ఆర్జీల పరిష్కారంలో మానవీయ కోణం అవసరం
- ఉద్యోగులు సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోవాలి
- క్షేత్రస్థాయి పర్యటనలతోనే వాస్తవాలు తెలుస్తాయి
- నవీన ఆలోచనలకు ప్రాధాన్యం
- రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయి
- అధికారులతో సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయి. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నాయి. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ‘ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పీజీఆర్ఎస్ సహా ప్రజల నుంచి వచ్చే ఆర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు,

-మిగతా 2 లో

## ఖతార్ గ్యాస్ ప్లాంట్‌లో పేలుడు..

- 12 మంది భారతీయులు మృతి



2



## బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

- లేబర్ పార్టీ ఒత్తిడితోనే పదవి నుంచి విముఖత
- పదేళ్లలో ఆరుగురు ప్రధానుల రాజీనామా
- ఎన్నికల వైఫల్యాలే కారణమన్న విశ్లేషకులు
- రాయబారి నియామక వివాదంపై పెరిగిన వ్యతిరేకత
- వలసల విధానం వల్లేనన్న డోనాల్డ్ ట్రంప్
- సొంత పార్టీ ఎంపీల ఒత్తిడికి లొంగిన స్టార్మర్

**లండన్,**
బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత నెలకొంది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. తాజా పరిణామంతో బ్రిటన్‌లో దశాబ్ద కాలంలో తమ పదవులకు రాజీనామా చేసిన ప్రధానుల సంఖ్య ఆరుకి చేరింది. కీర్ స్టార్మర్ 2024లో

-మిగతా 2 లో

## సింధుజలాలపై అవసరమైతే యుద్ధం



- భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
- నీటి హక్కుల కోసం ఏ స్థాయికైనా వెళ్తామని ప్రకటన
- పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు

**ఇస్లామాబాద్**
సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక్ ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు.

-మిగతా 2 లో

### వేధించినోళ్లకు..

# ముక్కలే

**రిటైర్ అయినా వదిలిపెట్టం**

- కార్యకర్త గౌరవమే పార్టీ గౌరవం
- అన్ని వర్గాలను వంచించిన కాంగ్రెస్
- రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బీఆర్ఎస్ కార్యకర్తలపై వేధింపులు, అక్రమ కేసులు పెడితే సహించబోమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం, పార్టీ శ్రేణుల ఆత్మగౌరవం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమై ప్రజలను మోసం చేసిందని తీవ్రంగా విమర్శించారు.

**వరంగల్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన, వేధించిన ఒక్కొక్కడిని రిటైర్ అయినా, పారిపోయినా, సప్త సముద్రాలు దాటినా లాక్కొచ్చి చుక్కలు చూపెడతామని అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు హెచ్చరించారు. తెలంగాణ ప్రజల కోసం, పార్టీ కార్యకర్తల కోసం అండగా నిలుస్తూ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు భరోసా కల్పించేలా కేటీఆర్ ఘాటుగా స్పందించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం బూత్ లెవెల్ కన్వీనర్ల

-మిగతా 2 లో






### 2047 నాటికి2.4 ట్రిలియన్ల

## ఆర్థిక వ్యవస్థగా ఏపీ

- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టియే కూటమి ప్రభుత్వ ధ్యేయం
- విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం వాటాతో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్
- రూ. 60,000 కోట్లతో అమరావతి నిర్మాణం..
- ఏపీలో మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లు: విశాఖ, అమరావతి, రాయలసీమ అభివృద్ధి ప్రణాళిక
- ఢిల్లీ సదస్సులో మంత్రి లోకేశ్ వెల్లడి

**న్యూఢిల్లీ జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన ’రిపబ్లిక్ టీవీ సమిట్ 2026’లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

-మిగతా 2 లో



## మమతకు ఊహించని షాక్..

- టీఎంసీ అధ్యక్ష పదవి దూరం
- కొత్త బాస్‌గా సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్
- అభిషేక్ బెనర్జీపై వేటు: సెక్రటరీ పదవి నుంచి తొలగింపు
- రిటాబ్రతా బెనర్జీ నేతృత్వంలో తిరుగుబాటు
- మూడు దశాబ్దాల పట్టు కోల్పోయిన దీదీ

**న్యూఢిల్లీ**
పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వరసగా షాక్‌లు తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంతో మొదలు.. రెబెల్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులతో సతమతమవుతున్న మమత ఈసారి ఏకంగా పార్టీ అధ్యక్షురాలి పదవిని కోల్పోయింది. రెబెల్ ఎమ్మెల్యే వర్గం ఆమెను టీఎంసీ అధినేత్రిగా తొలగించింది. మమత స్థానంలో టీఎంసీ నాయకుడిగా సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్ ఎంపికయ్యాడు. అంతేకాదు పలువురు సన్నిహితులు సైతం మమతకు దూరమయ్యారు.

-మిగతా 2 లో

## లక్నోలో భారీ అగ్నిప్రమాదం

మొదటి తరువాయి

ఏడుగురు విద్యార్థులు భవనం నుంచి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఎనిమిద్గి ÷రిరజన్లతో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పలువురు విద్యార్థులు భవనంలో చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్నిప్రమాదంపై స్పందించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలను వేగవంతం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రధానమంత్రి జాతీయ ఉపశమన నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరికీ రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ ఘటనలో దాదాపు 14 మంది మృతి చెందినట్లు సమాచారం. లఖ్‌నవూ కోచింగ్ సెంటర్ అగ్నిప్రమాద స్థలాన్ని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. అగ్నిప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో కొంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి నివేదిక అందించాలని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), అదనపు ప్రధాన కార్యదర్శి (హోం)లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

## అమెరికాకు షాకిచ్చిన చైనా

మొదటి తరువాయి

చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైదూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.


## బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

మొదటి తరువాయి

బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ పేలవమైన ప్రదర్శన మాత్రమే ఇవ్వడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (ఆనీనిజీటె ÷ుసబీపూ) ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు.

## ఖతార్ గ్యాస్ ప్లాంట్‌లో పేలుడు..

-12 మంది భారతీయులు మృతి



దోహా
ఖతార్‌లోని ప్రముఖ రాస్ లఫాన్ లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్(ఎల్ఎన్‌సీ) పరిశ్రమలో సంభవించిన భారీ పేలుడులో 13 మంది మృతిచెందగా, మరో 66 మంది గాయపడ్డారు. మృతుల్లో 12 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇరాన్ జరిపిన క్షిపణి దాడి కారణంగా నిలిచిపోయిన కార్యకలాపాలను కార్మికులు పునరుద్ధరిస్తున్న సమయంలో ఈ పేలుడు చోటుచేసుకుంది. 'బర్జాన్' గ్యాస్ సరఫరా విభాగంలో ఈ ప్రమాదం జరిగిందని, ఇది ఒక సాంకేతిక ప్రమాదం అని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై దోహాలోని భారత రాయబార కార్యాలయం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడగా, మరికొందరు అదృశ్యమయ్యారని పేర్కొన్నది. కాగా ఇండస్ట్రియల్ కాంప్లెక్స్‌కు 70 కిలోమీటర్ల దూరంలోని సెంట్రల్ దోహాలో ఈ పేలుడు ధాటికి కిటికీలు కంపించాయని, స్థానికులు భయాందోళనలకు గురయ్యారని సమాచారం. ఈ ప్రమాదం కారణంగా ఖతార్ ఎల్ఎన్‌సీ ఎగుమతి సామర్థ్యానికి ఎలాంటి ఆటంకం లేదని, పర్యావరణానికి ఎటువంటి హాని జరుగలేదని ఖతార్ ఇంధన మంత్రిత్వశాఖ తెలిపింది.

## 2047 నాటికి2.4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ

మొదటి తరువాయి

తృణమూల్ కాంగ్రెస్‌పై మమతా బెనర్జీ పట్టు కోల్పోయింది. 1998లో టీఎంసీని స్థాపించి మూడు దశాబ్దాలుగా పశ్చిమ బెంగాల్‌లో చక్రం తిప్పిన మమత.. అనూహ్యంగా పార్టీ చైర్ పర్సన్ పదవికి దూరమయ్యారు. రిటాబ్రతా బెనర్జీ నేతృత్వంలోని రెబెల్ ఎమ్మెల్యేలు మమతను తమ బాస్‌గా నిరాకరించారు. సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ని టీఎంసీ కొత్త నాయకుడిగా ఎన్నుకున్నారు. అంతేకాదు.. తమదే అసలైన తృణమూల్ కాంగ్రెస్ అని రిటాబబ్రతా వర్గం ప్రకటించింది. అంతటితో సరిపెట్టకుండా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీని పార్టీ జాతీయ జనరల్ సెక్రటరీగా తప్పించారు. స్థానిక న్యూ టౌన్‌లోని హోటల్‌లో పార్టీ కౌన్సిలర్లతో సమావేశమైన రిటాబబ్రతా బెనర్జీ.. పార్టీలో ఐదేళ్ల అనంతరం సంస్థాగత మార్పులు జరగలేదని, అందుకే రాజ్యాంగబద్ధంగా తాము జాతీయ నాయకత్వాన్ని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మమతను తృణమూల్ కాంగ్రెస్ చైర్ పర్సన్‌గా తొలగిస్తూ.. హౌరా సెంట్రల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన అరూప్ రాయ్‌కు పగ్గాలు అప్పగించారు. అయితే.. మమత సన్నిహితులు కొందరు మాత్రం ఈ మొత్తం వ్యవహారాన్ని ఒక కామెడీ షోగా అభివర్ణించారు.

# ఫేక్ ప్రచారాలకు చెక్ పెట్టండి

మొదటి తరువాయి

అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఉద్యోగులు వినూత్నంగా ఆలోచన చేసేలా ప్రోత్సహిస్తాం. పద్ధతి ఆధారంగా బాధ్యతను అప్పగిస్తాం అని అన్నారు. అధికారుల స్థానంలో ఉండి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలి అని హితబోధ చేశారు. దీని ద్వారా పాలనపై ప్రజల్లో మంచి భావన కలుగుతుంది. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఉద్యోగులు పాలనా పరంగా సామర్థ్యాలను పెంచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పని విధానం మార్చుకోవాలి అని సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

**క్షేత్రస్థాయిలో పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వాలి :** క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలుగుతాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 'మంత్రులు, అధికారులు, ఉద్యోగులు క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రాధాన్యమివ్వాలి. ఏపీకి బలమైన మానవ వనరుల వ్యవస్థ అవసరం. పాలనలో సంస్కరణలకై ఉద్యోగులకు, అధికారులకు శిక్షణ ఇప్పించాలి. పాత రోజుల్లో ఫైల్ క్లియరెన్స్ అనేది అతి పెద్ద టాస్క్ గా ఉండేది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సులభంగా వాటిని క్లియర్ చేయగలిగే పరిస్థితి ఉంది. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం అవుతాయి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సహకరిస్తాం

మొదటి తరువాయి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి,
కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటిగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి సీఎం స్పష్టం చేశారు. . భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు



ప్రయాణీకుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు కార్గో, ఎమ్ఆర్వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు . ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్లను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూల సీఎం విజ్ఞప్తి చేశారు . తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో, డీఆర్డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే లంగర్ హౌస్ బాపూ ఘాట్ సమీపంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'గాంధీ సరోవర్ ప్రాజెక్టు' నిర్మాణానికి అవసరమైన రక్షణ శాఖ భూములను బదలాయించినందుకు కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డి ఆర్ డి ఓ / డి ఆర్ డి ఎల్ సంస్థలు ఎంచుకున్న స్థలంలో డిఫెన్స్ ఫెసిలిటీ (కీలక రక్షణ ప్రాజెక్టు) ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని రక్షణ మంత్రిని విజ్ఞప్తి చేశారు.

## సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

మొదటి తరువాయి

భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప్పు కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక్ ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాక్‌కు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించు కోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. ÷ూగా, ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

## వేధించినోళ్లకు.. చుక్కలే

మొదటి తరువాయి

సమావేశం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇదే వరంగల్ వేదికగా రైతు గర్జన పేరుతో ఢిల్లీ పెద్దలను పిలిపించి సభ పెట్టి రైతులకు ఎకరానికి 6000 రైతుబంధు, పంటకు గిట్టుబాటు ధరలతో పాటు బోనస్‌గా 500 రూపాయలు ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు మూడు నెలలు అమలు చేస్తామని అన్ని వర్గాల ప్రజలను వంచించారని కేటీఆర్ విమర్శించారు. మహిళలకు స్కూటీలు ఇస్తామన్నారు.. రైతు కూలీలకు భరోసా ఇస్తామన్నారు.. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇలా అన్ని వర్గాల ప్రజలను 13 డిక్లరేషన్ సభలు పెట్టి మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. దేశంలో అన్ని రాష్ట్రాలు కాంగ్రెస్‌ను వదిలించుకున్నాయి. కానీ తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నాయి. మరో ఏడాదిన్నరలో వచ్చేది కేసీఆర్ నాయకత్వంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, కార్యకర్తల ఆత్మగౌరవాన్ని రక్షించేందుకు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కార్యకర్తే పార్టీకి వెన్నెముక
కార్యకర్త గౌరవమే బీఆర్ఎస్ గౌరవం అని అన్నారు. హాస్టల్లో రాష్ట్రంలో ఏ మూలకు పోయినా కాంగ్రెస్ పాలన పోవాలి కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని బూత్ లెవెల్ కన్వీనర్లు బాధ్యతగా తీసుకొని సర్‌ను జాగ్రత్తగా పరిశీలించి మన ఓట్లు పోకుండా చూసుకోవాలన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అధ్యక్షతన జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గం బూత్ లెవెల్ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, డాక్టర్ తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, వెంకటరమణారెడ్డి, కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, రైతు రుణముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు రైతుబంధు వరంగల్ జిల్లా మాజీ కన్వీనర్ లలిత యాదవ్, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## 2047 నాటికి2.4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ

మొదటి తరువాయి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేష్ గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు ఎంత వేగంగా జరుగుతున్నాయో వివరించడానికి మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక రక్షణ ప్రాజెక్ట్ కోసం కేవలం 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని సేకరించి అప్పగించాం.
గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే పట్టాలెక్కించి ప్రభుత్వ స్పీడ్‌ను నిరూపించాం. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో మన రాష్ట్ర గొంతు ఎంతో బలంగా వినబడుతోందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌ను మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి లోకేష్ వివరించారు. విశాఖపట్నం ఐటీ హబ్‌గా, అమరావతి నాలెడ్జ్ హబ్ గా, రాయలసీమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారబోతున్నాయని అన్నారు. రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్, రామగుండం, ఓదెల మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను వివరించగా, కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులకు రాసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూమి ఆక్రమణలు, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం, విద్యార్థుల హాస్టల్ సీట్లు వంటి అంశాలపై వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి, డిఆర్ఓ రాజేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పై గజ్జల కాంతం సంచలన ఆరోపణలు



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై రూ.900 కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం ఆరోపించారు. కరీంనగర్ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున దోపిడీ జరిగిందని, పుట్ట మధు ఆస్తులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు గురించి మాట్లాడే నైతిక అర్హత పుట్ట మధుకు లేదని, ఆయన దివంగత నేత శ్రీపాదరావు రాజకీయ బిక్షతో ఎదిగారని కాంతం విమర్శించారు. ఇసుక దందా, గంజాయి వ్యాపారం, హత్య కేసుల ఆరోపణలు పుట్ట మధుపై ఉన్నాయని తీవ్రస్థాయిలో నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట లక్ష కోట్ల అవినీతి జరిగిందని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని కాంతం మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం ఖాయమని, ప్రజలు ఇకపై ఆ పార్టీని నమ్మరని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సముద్రాల అజయ్, కేశవేని రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌నగర్ రిజర్వాయర్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ మేయర్



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: నగరంలోని 42వ డివిజన్ భగత్‌నగర్ మంచినీటి రిజర్వాయర్‌ను డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాంతంలో తరచుగా లీకేజీల కారణంగా తాగునీరు వృథా అవుతోందని గమనించి రిజర్వాయర్‌లో పైపులైన్లు, వాల్వులు, సంపులు, మోటార్ పంపులు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. సిబ్బంది తక్కువగా ఉండటం, డ్రైనేజీ మరమ్మతులు జరగకపోవడం వల్ల నీరు రోడ్లపైకి వృథాగా వస్తోందని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భగత్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో 20 పైపులైన్ లీకేజీలు ఉన్నాయని గుర్తించామని, వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించడమే నగరపాలక సంస్థ ప్రథమ కర్తవ్యమని, రిజర్వాయర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సురక్షిత నీటి సరఫరాపై ప్రజల విశ్వాసం నిలబెట్టేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిప్యూటీ మేయర్ స్పష్టం చేశారు.

# ధాన్యానికి కటింగ్ లేకుండా బిల్లులు తక్షణమే చెల్లించాలని రైతుల నిరసన



**ఖానాపూర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి కటింగ్ లేకుండా బిల్లులు తక్షణమే చెల్లించాలని రైతులు సోమవారం మస్కపూర్ రోడ్డుపై ధర్నా చేపట్టారు. ధాన్యం బిల్లులు ఆలస్యం అవుతున్నందుకు ఆగ్రహించిన రైతులు రహదారి రోకో నిర్వహించడంతో వాహనాలు నిలిచిపోయాయి. వర్షాకాలం పంటకు సిద్ధమవుతున్న సమయంలో డబ్బుల కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో వివిధ గ్రామాల రైతులు, మాజీ రైతు సమన్వయ కమిటీ చైర్మన్ పుప్పాల గజేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్‌తో పాటు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఐకెపి కేంద్రంలో అవినీతి ఆరోపణలు



**ఖానాపూర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మస్కాపూర్ గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో నడుస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవినీతి జరుగుతోందని రైతులు ఆరోపించారు. ధాన్యం తూకం 41 కేజీలు వేసి, రైస్ మిల్లులకు పంపిన తర్వాత 38 కేజీలకే డబ్బులు చెల్లిస్తున్నారని, అదనపు ఖర్చులు రైతుల వద్ద నుండి వసూలు చేస్తున్నారని వారు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తూకం వేసిన తర్వాత ఇవ్వాల్సిన రసీదులు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. రైతులు కలెక్టర్‌ను కోరుతూ, అవినీతి పై దర్యాప్తు జరిపి ఐకెపి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇకపై ఇలాంటి అక్రమాలు జరగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిలో పుప్పాల గజేందర్, నాలం శంకర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులకు రహదారిని పరిశీలించిన చైర్మన్ మౌనిక



**ఖానాపూర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పట్టణంలో ఆగిపోయిన రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేసి, మొత్తం పాలకవర్గంతో కలసి జిల్లా కలెక్టర్‌ను కలిసి నిధులు సమకూర్చాలని మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ తెలిపారు. సోమవారం ప్రధాన రహదారి పరిశీలన సందర్భంగా షాపుల యజమానులు రోడ్లపై సామాగ్రి పెట్టకుండా, అక్రమ షెడ్లు, ఫ్లెక్సీలు తొలగించాలని ఆమె ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి వాహనదారులు, ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా రహదారుల గుంతలు తాత్కాలికంగా పూడ్చడం, విద్యుత్ స్తంభాలపై పాడైన లైట్ల స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలను మున్సిపల్ సమావేశంలో తీర్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేకాటస్థావరం పై దాడి - 10 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ III టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వావిలాలపల్లి గ్రామంలో జూదం జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఉన్నతాధికారుల అనుమతితో పోలీసులు సోమవారం దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ జి. తిరుమల్ మాట్లాడుతూ, "జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం. దాడి సమయంలో కోటగిరి భూమ గౌడ్, కట్ట రమేష్, కాశెట్టి రమేష్, పుదారి గంగారెడ్డి, బుద్దుల రవీందర్, పర్శ మల్లేశం, డబ్బు తిరుపతి రెడ్డి, ఏనుగుల రాయమల్లు, దొంతుల సురేష్, దండేవేని తిరుపతి అనే 10 మంది వ్యక్తులు మూడు పత్తాల జూదం ఆడుతూ నగదు పందాలు కాస్తుండగా పట్టుబడ్డారు. మరో ఇద్దరు వ్యక్తులు జంగిలి సాగర్, సుధాకర్ సంఘటనా స్థలం నుండి పరారయ్యారు. నిందితుల వద్ద నుండి రూ.11,470 నగదు, 9 మొబైల్ ఫోన్లు, 52 పేకాట పత్తాలు స్వాధీనం చేసుకున్నాం. అరెస్టు చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నాం" అని తెలిపారు. అతను మరింతగా హెచ్చరిస్తూ, "ప్రజలు జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలి. ఇటువంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. సమాజంలో శాంతి భద్రతలు కాపాడటం కోసం పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారు" అని స్పష్టం చేశారు.

# భూమికి దారి కల్పించండి అంటూ కలెక్టరేట్లో రైతు వినతి



**పెద్దపల్లి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఓదెల మండలానికి చెందిన రైతు తాటికొండ రమేష్ తన పొలానికి వెళ్లే దారి కల్పించాలని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 943లో 1.05 ఎకరాల భూమి ఉన్నప్పటికీ, చుట్టుపక్కల భూస్వాములు హద్దు రాళ్లు తొలగించి సుమారు 7 గుంటల భూమిని ఆక్రమించారని ఆయన ఆరోపించారు. ట్రాక్టర్లు, కూలీలను అడ్డుకోవడం, చెరువును ఆక్రమించడం, కాలువను ధ్వంసం చేయడం వల్ల సాగునీరు అందడం లేదని వాపోయారు. ఆరు సంవత్సరాలుగా కలెక్టర్లు, అధికారులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగినా పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈజ్‌మెంట్ హక్కుల చట్టం ప్రకారం తన పొలానికి రహదారి ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

# నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర వైఫల్యం

-- ఎంపీ వంశీకృష్ణ ఆగ్రహం



**పెద్దపల్లి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా లక్షలాది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారని, ఒకసారి పరీక్ష రద్దు కావడంతో మళ్లీ సిద్ధమైన విద్యార్థులను ఆలస్యంగా వచ్చారనే కారణంతో పరీక్షకు అనుమతించకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం పని చేయండి, వారి జీవితాలతో ఆడుకోవద్దు అని ఎంపీ వంశీకృష్ణ హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల వద్ద కన్నీటి పర్యంతమైన విద్యార్థులు, తల్లిదండ్రుల ఆవేదన ప్రభుత్వానికి శాపంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. యువత ఆశయాలను గౌరవించి, వారి భవిష్యత్తును కాపాడే చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.

# భూపాలపల్లి ఆర్టీవో వెంకన్న మృతి ఘటనపై ఆగ్రహం



**అమ్రాబాద్/భూపాలపల్లి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్రమ ఇసుక రవాణా వాహనాలను తనిఖీ చేస్తూ ఆర్టీవో వెంకన్న లారీ ఢీకొని మృతి చెందిన ఘటనపై తెలంగాణ గెజిటెడ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. రాములు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం ఉద్యోగ వర్గాన్ని కలచివేసిందని, ఇలాంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా అధికారుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టే అధికారులకు ప్రభుత్వం పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాములు ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంకన్న కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సహాయం ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి శాశ్వత చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంకన్న అకాల మరణంపై సంతాపం వ్యక్తం చేసిన రాములు, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

# సర్పంచ్ తండ్రి మృతి -- పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**కురవి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లెల గ్రామ సర్పంచ్ రెంటాల కృష్ణ తండ్రి రెంటాల తిరుపయ్య మృతి చెందిన వార్త తెలిసిన వెంటనే కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం సోమవారం మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. తిరుపయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, "మీ ఆపదలో మేము అండగా ఉన్నాం. ధైర్యంగా ఉండండి" అని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గజ తండా సర్పంచ్ బానోత్ శివలాల్, మోదుగులగూడెం సర్పంచ్ ప్రవీణ్, గ్రామ పార్టీ అధ్యక్షులు వాసు, మల్లయ్య, అలాగే నల్లెల, గాజు తండా కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ, "ఆపదలో అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకుల పరామర్శ మాకు ధైర్యం ఇచ్చింది" అని అభిప్రాయపడ్డారు.

# పిడుగు పడడంతో 11 జీవాలు మృతి



**ఖానాపూర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సత్తెనపల్లి, సారంగాపూర్ అడవుల్లో సోమవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షం, పిడుగుపాటుతో 11 జీవాలు మృతి చెందాయి. బాధితుడు చిన్నమనిషి తెలిపిన వివరాల ప్రకారం, మేతకు తీసుకువెళ్లిన ఆరు మేకలు, ఐదు గొర్రెలు పిడుగుపాటుతో చనిపోయాయి. వాటి విలువ లక్ష రూపాయలకుపైగా ఉంటుందని, నష్టానికి పరిహారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు

# అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంధం స్వామి నియామకం



**అమ్రాబాద్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా కొత్త అధ్యక్షుడు గంధం స్వామికి సోమవారం అచ్చంపేట టీఎన్జీవో భవనంలో ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ అధ్యక్షుడు బాలకృష్ణయ్య అధ్యక్షత వహించారు. మాజీ ఎంపీపీ రామనాథం, యురేనియం వ్యతిరేక పోరాట నాయకుడు కలుమూల నాసరయ్య, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు కాశన్న యాదవ్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు సిద్ధార్థ మహదేవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బిటిఎ, బిసిఎ, ఎస్ ఎస్ డి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని గంధం స్వామికి శుభాకాంక్షలు తెలిపారు

# విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి



**గంగాధర, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన ఆరేపల్లి హన్మయ్య (80) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. జూన్ 21 సాయంత్రం గాలి దుమారం, వర్షం కారణంగా విద్యుత్ స్తంభం కూలిపోవడంతో రోడ్డు మీద వెళ్తున్న ఆయన బండి అదుపుతప్పి పడిపోయింది. ఈ సమయంలో కరెంటు వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ వెల్లడించారు.

## రోళ్లపాడు అభయారణ్యంలో జింక మృతి





**నంద్యాల, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిడుతూరు మండలంలోని రోళ్లపాడు అభయారణ్యంలో ఒక జింక అనుమానాస్పదంగా మృతి చెందింది. అటవీశాఖ అధికారులు మృతి చెందిన జింకకు పోస్టుమార్టం నిర్వహించగా, తిన్న ఆహారం అరగక కడుపు ఉబ్బి చనిపోయిందని వెటర్నరీ డాక్టర్ సాయినాథ్ రెడ్డి నివేదికలో వెల్లడించారు. జింకలు, బట్టమేకల ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన రోళ్లపాడు అభయారణ్యంలో ఈ ఘటన ఆందోళన కలిగిస్తోంది.

# తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరపాలక సంస్థ 27వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ బొట్ల శ్యామల కిరణ్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రైవేటు స్కూల్ బస్సుల అడ్డగింత




**పాలకుర్తి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను గ్రామంలోకి రానివ్వకుండా పంచాయతీ పాలకవర్గాలు నిర్ణయం తీసుకున్నాయి. రామారావుపల్లి గ్రామంలో సోమవారం గ్రామ శివారులో బస్సులను అడ్డుకుని ఇకపై గ్రామంలోకి ప్రవేశించనివ్వబోమని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందిస్తున్నాయని సర్పంచ్ అన్నం లక్ష్మీనారాయణ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. మండలంలో పంచాయతీలు మూకుమ్మడిగా బస్సులను అడ్డుకోవడంతో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండి సాగర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయి

**- ఏసిపి మాధవి**




**హుజురాబాద్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాదకద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని హుజురాబాద్ ఏసిపి మాధవి హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా సిపి గౌస్ ఆలం ఆదేశాల మేరకు సోమవారం హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని సూచించారు. విద్యాసంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల వాడకం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులను కోరారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి చదువుకు దగ్గరగా ఉంటే అభివృద్ధి సాధ్యమని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ కరుణాకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సర్పంచ్ తండ్రి మృతి...
### పరామర్శించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్





**కురవి , జూన్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కురవి మండలం నల్లెల్ల గ్రామ సర్పంచ్ రెంటాల కృష్ణ తండ్రి రెంటాల తిరుపయ్య ఆదివారం స్వర్గస్తులైనారు సమాచారం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్ తిరుపయ్య మృత దేహం పై పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ జిల్లా నాయకులు పిచ్చిరెడ్డి , రవి నాయక్ , కురవి మండల పార్టీ అధ్యక్షులు లాలయ్య , మాజీ ఎంపీటీసీ చంద్రారెడ్డి , ఉప సర్పంచ్ కృష్ణమూర్తి , దీపక్ గౌడ్ , ముస్తఫా , మల్లికార్జున్ సూర్యతండ సర్పంచ్ మంగీలాల్, సీరోల్ మండల బిఆర్ఎస్ నాయకులు బోజ్య నాయక్, మాజీ వైస్ ఎంపిపి నర్సయ్య, నల్లెల్ల బిఆర్ఎస్ నాయకులు ఉప్పలయ్య, రాంబాబు, కృష్ణ, మల్లయ్య, చాంద్, మల్లయ్య, శ్రీను, సత్తిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఉప్పల్ రెడ్డి, ఉపేంద్ర చారి, వెంకన్న,బిచ్చురాం,కోటయ్య మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు బంద్ పిలుపు - ఏబీవీపీ




**పాలకుర్తి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు మద్దతు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు బంద్ పిలుపునిచ్చినట్లు రాష్ట్ర ఏబీవీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మారం సందీప్ తెలిపారు. బసంతనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రేషనలైజేషన్ పేరుతో 23 వేల పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25% సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిఈఓ పోస్టులను భర్తీ చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గురుకుల పాఠశాలలకు భవనాలు నిర్మించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఎన్ఈపి 2020, బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను అమలు చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏబీవీపీ నాయకులు విగ్నేష్, నవీన్, వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

### మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో యాంటీ డ్రగ్స్ పై అవగాహన సదస్సు




**గంగాధర, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంగాధర ఎస్సై వంశీకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని హెచ్చరించారు. విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాము, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



**పాలకుర్తి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గన్‌శ్యాందాస్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ బండారి శ్రీవాణి కిరణ్, హెచ్ఎం కేతిపల్లి ప్రభాకర్ రెడ్డి సూచనపై స్వయంగా ఖర్చు చేసి విద్యార్థులకు ప్లేట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా బడికి హాజరై శ్రద్ధగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు చందుపట్ల మధు కుమార్, రేణుకుంట్ల చంద్రయ్య, బత్తుల లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత..



**కల్వకుర్తి, జూన్ 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కల్వకుర్తి మండల పరిధిలోని తాండ్ర గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి రాములు కు సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును తాండ్ర మాజీ సర్పంచ్ గోలి కమలమ్మ చేతులమీదుగా ఆ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## శాతవాహన ఇంజినీరింగ్ కళాశాలలో హాస్టళ్ల నిర్మాణానికి ఆమోదం



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ శాతవాహన విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో బాలుర, బాలికల హాస్టళ్ల నిర్మాణానికి కార్యనిర్వాహక మండలి ఆమోదం తెలిపింది. ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం, రెండు హాస్టళ్ల నిర్మాణానికి రూ. 14.56 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. నిర్మాణ బాధ్యతలను తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి అప్పగించారు. ఉమ్మాపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో హాస్టళ్ల నిర్మాణం జరగనుండగా, 2027 జూన్ 30లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ హాస్టళ్లు సిద్ధమైతే గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన వసతి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఐకెపి నిర్వాహకుడు తీవ్ర గాయాలు



**పాలకుర్తి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈశాల తక్కల్లపల్లి గ్రామానికి చెందిన పొన్నం సాయి తిరుమల్ (28) ఆదివారం రాత్రి బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఐకెపి కేంద్రం నిర్వాహకుడిగా పనిచేస్తున్న ఆయన, కొనుగోలు ప్రక్రియ ముగిసిన తర్వాత వస్తువులు ఇంటికి తీసుకువెళ్తుండగా పెద్దమ్మ ఆలయం వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోమాలో ఉన్న తమ కుమారుడిని ప్రభుత్వం రక్షించాలని తల్లిదండ్రులు శంకరయ్య, రాజేశ్వరి విలపిస్తూ వేడుకున్నారు.

## ప్రమాదానికి గురైన యువకుడికి రక్తదానం



**తిమ్మాపూర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గొల్లపల్లి గ్రామానికి చెందిన వేల్పుల అరవింద్ బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్ మారుతి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అరవింద్‌కు బి ప్లస్ రక్తం అత్యవసరంగా అవసరమైన సమయంలో, ఎలాబోతర గ్రామానికి చెందిన బుచ్చల కొమరయ్య స్పందించి కరీంనగర్ బ్లడ్ బ్యాంక్‌లో నాలుగోసారి రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడటం గొప్ప సేవ అని పాల్గొన్న గాలిపెల్లి కుమార్, ఇతరులు పేర్కొన్నారు. రక్తదానం ఒక సామాజిక బాధ్యత -- ప్రాణదాతలు కండి.

## జలధార--జలహారతి పనులు త్వరగా పూర్తి చేయాలి

**- కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జలధార--జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన పనులను జూలై 1వ తేదీకి ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మంజూరైన 2,103 పనుల్లో ఇప్పటివరకు 1,587 పూర్తయ్యాయని, ఇంకా 516 పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కానున్నందున మిగిలిన పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యతను విస్మరించకుండా, క్షేత్రస్థాయి నివేదికలు, ఆన్‌లైన్ డేటా మధ్య వ్యత్యాసాలు లేకుండా చూడాలని హెచ్చరించారు. థర్డ్ పార్టీ వెరిఫికేషన్, సక్సెస్ స్టోరీల తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్ పనుల పరంగా రుద్రవరం మండలం 52 పనులతో మొదటి స్థానంలో ఉందని, డోన్, కొలిమిగుండ్ల, ఆత్మకూరు, సిరివెళ్ల తదితర మండలాల్లో కూడా ఎక్కువ పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. చెరువుల అభివృద్ధి, పూడికతీత, మరమ్మతులు, నీటి నిల్వ సామర్థ్యం పెంపు వంటి ఫలితాలను స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నిరసన



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలులో సమస్యలు కొనసాగుతున్నాయని, నాణ్యమైన ఆహారం అందించేందుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి పుస్తకాలు, యూనిఫార్మ్ పేరుతో దోపిడీ చేస్తున్నాయని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఫీజుల నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాలల సంఖ్యను తగ్గించకుండా కొత్త ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్నవాటిని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షుడు ఇషాక్, సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, కమిటీ సభ్యులు రత్నం సురేష్, సందేశ్, సన్నీ, అక్షయ్, మానస, సంజన, సాయి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటు మున్సిపల్ కార్మికుల ధర్నా




**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమని యూనియన్ నేతలు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన కార్మికులు, సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, 2వ పిఆర్సిలో కనీస వేతనం రూ. 26,000గా నిర్ణయించాలని, డిఏ అమలు చేయాలని, మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు రూ. 30,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 65 వేల మంది మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నా పర్మినెంట్ చేయకపోవడం, వేతనాలు ఆలస్యంగా చెల్లించడం, వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హామీలు అమలుకాకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారని, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల రమేష్, పున్నం రవి, కవ్వంపెల్లి రవి, కంపెల్లి పోచయ్య, మనుపాటి మల్లేశం, జంగం రవీందర్, చంద్రకళ, వడ్లూరి అంజయ్య, రసపెల్లి సరోజన, రొంటాల భాగ్య, బోళ్ల శ్రీనివాస్, కూర రాజు, ఎర్రళ్ల రాజయ్య, కొలుగురి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీపై బిఆర్ఎస్వి వినతి



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని బిఆర్ఎస్వి నేతలు జిల్లా విద్యాధికారిని కోరారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్వి నేతలతో కలిసి డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నోటు పుస్తకాలు, యూనిఫార్మ్, స్టేషనరీ పేరుతో పేదవారిని దోచుకుంటున్నారని, డిఫెన్స్ అకాడమీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలు నడుస్తున్నాయని ఆరోపించారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 100% ఫీజు రాయితీ కల్పించాలని డీఈఓను కోరగా, ఇప్పటికే ఆర్డర్లు జారీ చేశామని, ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని బిఆర్ఎస్వి హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో ధ్యాస మధుసూదన్ రెడ్డి, చుక్క శ్రీనివాస్, బొంకూరి మోహన్, పటేల్ శ్రవణ్ రెడ్డి, ఆరే రవి గౌడ్, సోమిరెడ్డి రాజా నరేష్ రెడ్డి, పొన్నం శ్రీకాంత్ గౌడ్, రవి నాయక్ మున్నా, ఎల శేఖర్ బాబు, విక్రమ్, పటేల్ సుధీర్ రెడ్డి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, మాడిశెట్టి అజయ్, వినోద్, దినేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమయస్ఫూర్తితో ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఆర్టీసీ డ్రైవర్



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అల్గనూర్ వద్ద జరిగిన బస్సు అగ్నిప్రమాదంలో 40 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఆర్టీసీ డ్రైవర్ బోయిని ప్రశాంత్‌ను తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రమాద సమయంలో సమయస్ఫూర్తితో స్పందించి ప్రయాణికులను సురక్షితంగా బయటకు దింపడం ప్రశంసనీయమని అన్నారు. బస్సులు బయలుదేరే ముందు పూర్తి ఫిట్‌నెస్ తనిఖీలు చేయాలని, ప్రమాదానికి గల కారణాలను ప్రభుత్వం దర్యాప్తు చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆదివాసి విభాగం అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, జంగ అపర్ణ సాగర్, బాసావేణి రజేందర్, నూతి చరణ్, యండి హుస్సేన్, గర్షకుర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


## ఒలింపిక్ స్ఫూర్తి... ప్రపంచ ఐక్యతకు క్రీడలే వారధి





శ్రేష్ఠత, స్నేహం, గౌరవానికి ప్రతీక ,ప్రతి సంవత్సరం జూన్ 23న అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 2026 థీమ్ క్రీడ: వారధులను నిర్మించడం, అడ్డంకులను తొలగించడం. క్రీడలు భాష, మతం, జాతి, లింగ భేదాలకు అతీతంగా ప్రపంచ ప్రజలను ఏకం చేస్తాయి. ఒలింపిక్ ఉద్యమం శ్రేష్ఠత, స్నేహం, గౌరవం అనే విలువలను ప్రోత్సహిస్తుంది. క్రీడలు కేవలం పతకాలకు మాత్రమే కాదు, క్రమశిక్షణ, నాయకత్వం, వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడతాయి. ఇటీవల జాతీయ క్రీడా పురస్కారాలలో మనూ భాకర్, డి. గుకేష్, హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రవీణ్ కుమార్‌లు ఖేల్ రత్న అవార్డులు అందుకోగా, జ్యోతి యర్రాజీ, అమన్ సెహ్రావత్ తదితరులు అర్జున అవార్డులతో సత్కరించబడ్డారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన పీ.వి. సింధు, సానియా మీర్జా, కోనేరు హంపి, గగన్ నారంగ్, కరణం మల్లీశ్వరి, మొహమ్మద్ సిరాజ్, సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి వంటి క్రీడాకారులు ప్రపంచస్థాయిలో దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చారు. క్రీడలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి, ప్రపంచ శాంతి మరియు ఐక్యతకు బలమైన వారధిగా నిలుస్తాయి.

**వ్యాసకర్త**
**వేల్పుల మహేందర్**
**అధ్యాపకులు**
**9912775834**



## అల్ఫోర్స్ జూనియర్ కాలేజీల ఘనంగా ఫ్రెషర్స్ డే





**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ జూనియర్ కాలేజీలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదివి సమాజానికి ఆదర్శంగా నిలవాలని వారు సూచించారు. డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గత 36 సంవత్సరాలుగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసి పోటీ పరీక్షల్లో విజయాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నామని, ఈ విద్యా సంవత్సరంలో 109 మంది విద్యార్థులు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు సాధించారని తెలిపారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించగా, తల్లిదండ్రులు నరేందర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లపై బీఆర్ఎస్ ఫిర్యాదు



**హుస్నాబాద్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, అడ్మిషన్లు, టీసీలు, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. ఆటస్థలాలు, పార్కింగ్ సదుపాయాలు లేకపోయినా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన అన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాస శ్రీనివాస్, కొమ్మెర నర్సింహారెడ్డి, చెన్నబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముప్పు శ్రీనివాస్ నియామకం



**హుస్నాబాద్ , జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ముప్పు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేస్తానని ముప్పు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## హలో ఉప సర్పంచ్--చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని పిలుపు



**మానకొండూర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జూన్ 25న హైదరాబాద్‌లో జరగనున్న హలో ఉప సర్పంచ్--చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపసర్పంచుల ఫోరం జిల్లా కోఆర్డినేటర్ ఆకు బత్తిని విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఫోరం అధ్యక్షుడు గడ్డి గణేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపసర్పంచులకు చెక్ పవర్ రద్దు ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాపాక ప్రవీణ్, ఉపాధ్యక్షులు మర్రి కుమారస్వామి, ఈడుముల సంపత్, వేల్పుల కొమురయ్యతో పాటు ఆడెపు రమేష్, మేకల మహేందర్, ముడగాని అనిల్ గౌడ్, కాల్వ శ్రీనివాస్ యాదవ్, పొలవేణి రాజేష్, జిల్లెల్ల రాజు తదితర గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతం



**సిద్దిపేట, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద 99 రోజుల కార్యాచరణను విజయవంతంగా అమలు చేసిన జిల్లా అధికార యంత్రాంగాన్ని ప్రత్యేక అధికారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ ఐఏఎస్ అభినందించారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్‌తో కలిసి వివిధ శాఖల పనితీరును ఆయన సమీక్షించారు. గ్రామ, వార్డు, మండల సభల ద్వారా వచ్చిన 19 వేల ఫిర్యాదులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సామాజిక పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన పూర్తి డాక్యుమెంటేషన్ సిద్ధం చేసి విజయగాథలను ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిపేలా ప్రచారం కల్పించాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

## కొత్తగట్టులో ర్యాంప్ ఏర్పాటుకు లైన్ క్లియర్



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్--వరంగల్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద ర్యాంప్ ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. స్థానికుల విజ్ఞప్తిపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో హైవే అధికారులు స్పందించారు. గతంలో గ్రామ ప్రజలు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి ర్యాంప్ అవసరాన్ని వివరించారు. మంత్రి ఆదేశాల మేరకు హైవే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ర్యాంప్ నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. దీంతో కొత్తగట్టు, పరిసర గ్రామాల ప్రజలకు రవాణా ఇబ్బందులు తొలగి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

## ఘనంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 87వ దినోత్సవం వేడుకలు



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సుభాష్ నగర్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్బి) 87వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, కార్పొరేటర్ బొట్ల శ్యామల, తంగేళ్ల కిరణ్ కుమార్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి, విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండారి శేఖర్ మాట్లాడుతూ, నేతాజీ ఆశయాలతో అవినీతి, అన్యాయాలకు వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని తెలిపారు. యువత నేతాజీ స్ఫూర్తితో సమాజంలో అసమానతలపై ప్రశ్నించి, నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యారావు, బద్రినేత, విద్యార్థి సంఘం నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్, గూడా కిష్టయ్య, రాహుల్, సజ్జు, సాగర్ బాబాన్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయిలో రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్



**హుస్నాబాద్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతు భరోసా పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకానికి రైతు భరోసా అని పేరు మార్చి ఎక్కువ సాయం అందిస్తామని హామీ ఇచ్చినా, గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన స్థాయిలో కూడా సాయం అందడం లేదని ఆయన విమర్శించారు. ఎకరం, రెండు ఎకరాల పరిమితులతో సాయం అందించడం రైతుల పట్ల వివక్ష అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు తమ జీతాలను పూర్తిగా తీసుకుంటున్నప్పుడు రైతుల సాయంలో కోతలు విధించడం అన్యాయం అని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసి, అర్హులైన ప్రతి రైతుకు పూర్తి స్థాయిలో ఆర్థిక సాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలా సిపిఐ నిరసన




**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలా లేక సిపిఐ ఆధ్వర్యంలో ఆక్రమించుకోవాలా ప్రభుత్వం తేల్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రశ్నించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. గత ప్రభుత్వ కాలంలో చింతకుంటలో నిర్మించిన 600 ఇండ్లను ఇప్పటికీ పంపిణీ చేయకపోవడం నిరుపేదలకు అన్యాయం అని ఆయన విమర్శించారు. రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇండ్లను కేటాయించకపోవడం నిర్లక్ష్యమని, తక్షణమే అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సిపిఐ నాయకులు ఆర్‌డిఓ షర్మిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి సురేందర్ రెడ్డి, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, బుచ్చన్న యాదవ్, గామినేని సత్యం, నగునూరి రమేష్, నునావత్ శ్రీనివాస్, బాకం ఆంజనేయులు, కాల్వ శ్రీనివాస్, తంగేళ్ల సదయ్య, బోయిని విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర కీలకం

**తిమ్మాపూర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర అత్యంత కీలకమని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కొత్తపల్లి గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై బీఎల్ఓ సూపర్‌వైజర్లకు అవగాహన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి కలిగి ఉందని, ఖచ్చితమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్య బలోపేతానికి అవసరమని తెలిపారు. ఓటర్ల పేర్లు అక్రమంగా




తొలగింపునకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని, తప్పులు లేదా చిరునామా మార్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ శిబిరంలో తహసీల్దార్లు కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఇప్ప నరేందర్, సురేష్, శ్రీకాంత్, విజయ్ కుమార్, కొత్తపల్లి సర్పంచ్ గోదారి శోభారాణి, పలువురు ఆర్ఐలు పాల్గొన్నారు.

## మేయర్ల శిక్షణకు హాజరుకానున్న కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ & డైరెక్టర్ ఆధ్వర్యంలో జూన్ 23న నిర్వహించనున్న మేయర్ల శిక్షణ కార్యక్రమానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హాజరుకానున్నారు.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లకు పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజా సేవల మెరుగుదల, మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కర్కానా గడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఓల్డ్ హైస్కూల్‌లో మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమం జరిగింది.చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.విద్యార్థులు సమస్యలు ఎదురైనప్పుడు పోలీస్ 100 లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ద్వారా సహాయం పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ, కానిస్టేబుళ్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాన్ షాపుల సమస్యకు తాత్కాలిక పరిష్కారం



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నగరంలోని పాన్ షాపుల యజమానులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆధ్వర్యంలో నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను కలిసిన నాయకులు, యజమానుల విజ్ఞప్తిని వివరించారు. పాఠశాలలు, విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పాన్ షాపులు ఉండకూడదనే ప్రభుత్వ నిబంధనను గౌరవిస్తామని, కానీ షాపులను మార్చుకోవడానికి నెల రోజుల గడువు కావాలని యజమానులు కోరారు. మైనర్లకు సిగరెట్లు, పాన్‌లు విక్రయించబోమని, ప్రతి షాప్ ముందు అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.సీపీ గౌస్ ఆలం సానుకూలంగా స్పందించి, షాపులను మార్చుకోవడానికి నెల రోజుల గడువు మంజూరు చేశారు. తమ సమస్య పరిష్కారానికి సహకరించిన నాయకులకు పాన్ షాప్ యజమానుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

## నూతన ఎంఆర్ఓగా నరేందర్ బాధ్యతలు స్వీకరణ



**గన్నేరువరం, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గన్నేరువరం మండలానికి నూతనంగా వచ్చిన ఎంఆర్ఓ నరేందర్‌ను బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మైసంపెల్లి తిరుపతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ శాఖ మండల అధ్యక్షులు మైసంపెల్లి మల్లేశం, బండి రాములు, గంగిపెళ్ళి శంకర్, కూన ఎల్లయ్య, వరాల అనిల్, జంగిటి రాములు, వడ్లకొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ చిత్ర మిశ్రా



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 192 మంది అర్జీదారులు దరఖాస్తులు సమర్పించగా, కొన్ని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని సంబంధిత అధికారులకు బదిలీ చేశారు.ప్రతి శాఖ వారీగా ఆన్లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్నామని, పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.కార్యక్రమంలో అశ్విని తానాజీ వాకడే, డిఆర్ఓ స్వామి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలసభ కార్యక్రమం



**కోహెడ, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోహెడలో విద్యార్థులే నిర్వహించిన బాలసభ కార్యక్రమం ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను ప్రతిబింబిస్తూ విజయవంతంగా సాగింది. ప్రధానోపాధ్యాయురాలు ఎన్. తిరుపతిబాయి అధ్యక్షత వహించగా, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు మీలా విజయ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆరవ తరగతి విద్యార్థులకు ఘన స్వాగతం పలికిన అనంతరం దేశభక్తి గేయాలు, పాటలు, ప్రసంగాలు, నృత్యాలు, వినోదాత్మక కార్యక్రమాలు విద్యార్థులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఫాదర్స్ డే సందర్భంగా ప్రత్యేక ప్రదర్శనలు ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మీలా శ్రీయ తరఫున బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, లక్ష్మణ్, గోపాల్ రెడ్డి, రాధా మాధవి, కొండయ్య, చంద్రమోహన్, గణేష్ మార్గదర్శకులుగా వ్యవహరించి విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం, ఉపాధ్యాయుల సహకారం, విజయ్ కుమార్ సమన్వయంతో బాలసభ విజయవంతంగా ముగిసింది.

## రైతన్నలకు వ్యవసాయ సంబంధిత పథకాలపై అవగాహన సదస్సు




**నందికొట్కూరు, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బిజినవేముల గ్రామంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతన్న సేవలో -- మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.మండల వ్యవసాయ అధికారి షేక్షావలి, తహశీల్దార్, హార్టికల్చర్ ఆఫీసర్, సర్పంచ్‌లు రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 23వ విడత, ఇతర వ్యవసాయ సంబంధిత పథకాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ ప్రారంభం



**కరీంనగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ సోమవారం సీపీ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు, డ్రగ్స్ వ్యతిరేక సంతకాల సేకరణ, డ్రగ్-ఫ్రీ క్యాంపస్ డిక్లరేషన్, కమ్యూనిటీ విజిలెన్స్ కమిటీల ఏర్పాటు వంటి కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని, నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## వర్షాల కోసం జలాభిషేకం



**గన్నేరువరం, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మైలారం గ్రామంలో ఉపాధి హామీ కూలి మహిళలు వర్షాలు కురవాలని గ్రామ దేవత పోచమ్మ తల్లికి జలాభిషేకం చేశారు.తడిబట్లతో నెత్తిన నీళ్ల బిందెలు మోసుకుని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేకం నిర్వహించారు. వర్షాభావంతో సాగునీరు లేక రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గ్రామ మహిళలు తెలిపారు.గ్రామ ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొని దేవతను ప్రార్థించారు.

## కాంగ్రెస్ పార్టీ నూతన మండల, మున్సిపల్ అధ్యక్షుల ఎన్నిక




**హుస్నాబాద్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వెన్న రాజు, మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వడ్డేపల్లి వెంకటరమణలను టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ నియమించారు.తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని ఇద్దరు నాయకులు హామీ ఇచ్చారు.మాలపల్లి సర్పంచ్ ఎన్నికల్లో వెన్న రాజు తన సతీమణి స్వర్ణలతను గెలిపించగా, వడ్డేపల్లి వెంకటరమణ 2026 మున్సిపల్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించి 20 వార్డుల్లో 16 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేయడంలో సహకరించారు.వారి నియామకంపై మండల, పట్టణ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తారని ఆకాంక్షించారు.

## మర్రిగూడలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు

### మత్తు పదార్థాలు తీవ్ర నేరమని పోలీసుల హెచ్చరిక

**మర్రిగూడ, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల కళాశాలలో సోమవారం గంజాయి మరియు డ్రగ్స్ మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎస్సై బి. రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.నాంపల్లి సీఐ దూది రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "మత్తు పదార్థాలు అమ్మడం మాత్రమే కాదు, వాటిని వినియోగించడం కూడా తీవ్ర నేరం. పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదవుతాయి" అని హెచ్చరించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఉయ్యాల వెంకటేశ్ గౌడ్, పాఠశాల సిబ్బంది, కానిస్టేబుళ్లు అనిల్, వెంకన్న, శిరీష తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి లోపాలపై సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఆందోళన




**నందికొట్కూరు, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు విఫలమయ్యాయని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు విమర్శించారు. నిలిసికారిపేట, శేషశనారెడ్డినగర్, గాంధీనగర్, వాల్మీకినగర్, వడ్డెపేట కాలనీలలో పార్టీ బృందం పాదయాత్ర నిర్వహించి, మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.కాలనీల్లో మంచినీటి సౌకర్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ లేక వర్షాకాలంలో మురికికుంటలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పేదలకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేని పరిస్థితి ఉందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కాటేపోగు సామన్న, తాలూకా నాయకులు లింగాల శ్రీనివాసులు, మహమ్మద్ భాష, జిల్లా నాయకులు టి. నరసింహులు, వేల్పుల ఏసన్న, వడ్డే రాజు, మేకల చంద్రశేఖర్, ప్రసాద్, ఎం. నారాయణ, ఈడిగ రంగడు, మహిళా సంఘం నాయకురాలు పి. మణికుమారి, ఎస్. ముర్తుజాభి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# మొహరం వేడుకలు ప్రజాశాంతికి భంగం కలగకూడదు - ఎస్ఐ మణికంఠ



**నందికొట్కూరు, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మొహరం వేడుకలు ప్రజాశాంతికి భంగం కలగకుండా, మత విభేదాలకు తావు లేకుండా సామరస్య వాతావరణంలో జరగాలని జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సూచనలతో బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ మణికంఠ ప్రజలకు తెలియజేశారు.పీర్ల ఊరేగింపులు నిర్వహించే సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఆంక్షలు మరియు పోలీస్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మణికంఠ హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎస్పీ భరోసా



**నంద్యాల, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్లో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ 128 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడిన ఎస్పీ, చట్ట పరిధిలో సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. నిర్ణీత గడువులోపల ఫిర్యాదులు పరిష్కరించాలని, పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అందజేయాలని ఆయన స్పష్టం చేశారు.

## గంగమ్మ గుడి పునర్నిర్మాణానికి విరాళాలు



**నందికొట్కూరు, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మల్యాల గ్రామంలోని గంగమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి విరాళాలు అందాయి. కడప జిల్లా పులివెందుల పారిశ్రామికవేత్త గువ్వల గంగాధర్ రూ.30 వేల విరాళం, పుట్ట కృష్ణయ్య కొణిదెల రూ.50 వేల విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆర్ఎంపి శ్రీనివాసులు మాట్లాడుతూ, గంగమ్మ దేవాలయాల పునరుద్ధరణకు గంగాధర్ ఎల్లప్పుడూ సహకారం అందిస్తారని తెలిపారు. బెస్త సంఘ సభ్యులు కూడా మరమ్మతుల పనులకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో బెస్త నాగసేశులు, పుట్ట కృష్ణయ్య కొణిదెల, శీలం రవి, వేల్పునూరు తదితరులు పాల్గొన్నారు.

# సిర్సవాడ వద్ద వంతెన నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన

**అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం -- ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**



తెలకపల్లి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
నాగర్‌కర్నూల్ జిల్లాలోని సిర్సవాడ సమీపంలో దుందుభి వాగుపై రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంతెన పనులకు పంచాయతీరాజ్ ఊ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, వంశీ కృష్ణ, జనంపల్లి అనిరుధ్ రెడ్డి, కాసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, "సిర్సవాడ, మాదారం, గుడిగానిపల్లి గ్రామాల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న వంతెన నిర్మాణం ఇప్పుడు సాకారం కావడం సంతోషకరం. ఈ వంతెనతో గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయి. విద్యార్థులు, రైతులు, అత్యవసర సేవలు పొందే ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది" అని అన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, సర్పంచ్ శ్రీదేవి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెంకటేశ్వరస్వామి ఆలయంలో చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**నేటి నుండి మూడు రోజులపాటు వైభవంగా ఉత్సవాలు**




**వినోబా నగర్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వినోబా నగర్‌లోని శ్రీ భూదేవి--శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి గురువారం వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి.మంగళవారం ఉదయం గరుడ, సుదర్శన, నరసింహ హవనాలు నిర్వహించి సంతాన ప్రాప్తి, వివాహం కోసం ప్రత్యేక యాగాలు జరగనున్నాయి. సాయంత్రం శ్రీ మహాలక్ష్మి హవనంతో పాటు ఎదురు కోళ్ల ఉత్సవం జరుగుతుంది.బుధవారం ఉదయం గణపతి, దుర్గా, నవగ్రహ హవనాలు నిర్వహించి, శ్రీనివాస తిరుకళ్యాణ మహోత్సవం జరుగుతుంది. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, 108 స్వర్ణపుష్పార్చన, స్వామివారి ఊరేగింపు భక్తులను ఆకట్టుకోనున్నాయి.గురువారం ఉదయం ఆదిత్య హృదయ, మన్యుసూక్త హవనాలు, మహా పూర్ణాహుతి, చక్రస్నానం జరుగుతాయి. సాయంత్రం శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.ప్రతిరోజూ యాగాలు, అన్నప్రసాద వితరణ, తీర్థప్రసాద గోష్టి నిర్వహించబడతాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులై తీర్థప్రసాదాలు స్వీకరించాలని దేవస్థాన కమిటీ కోరింది. బ్రహ్మోత్సవాలకు ధన రూపంలో లేదా వస్తు రూపంలో సహకరించాలని కూడా కమిటీ విజ్ఞప్తి చేసింది.

# కేటీఆర్ అహంకార వ్యాఖ్యలు మానుకోవాలి: మంత్రి సీతక్క





**- కడ్తాల్‌లో నూతన ఎంపీడీవో కార్యాలయ భవనం ప్రారంభం**
**- కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ విమర్శలకు ఘాటు సమాధానం**

**ఆమనగల్లు, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలనను సినిమాతో పోలుస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తీవ్రంగా ఖండించారు. ప్రజల కోసం నడుస్తున్న ప్రభుత్వాన్ని "సినిమా ఫస్ట్ హాఫ్ అట్టర్ ఫ్లాప్"గా అభివర్ణించడం రాజకీయ బాధ్యతారాహిత్యానికి, అహంకార ధోరణికి నిదర్శనమని ఆమె విమర్శించారు.సోమవారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో నిర్మించిన నూతన మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయ భవనాన్ని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు అసిఫ్ అలీతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వాలు పనిచేస్తాయని, అలాంటి పాలనను సినిమాలతో పోల్చడం సరైన రాజకీయ సంస్కృతి కాదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై నిర్మాణాత్మక సూచనలు చేయాల్సిన ప్రతిపక్షం, వాస్తవాలను విస్మరించి విమర్శలకే పరిమితమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు."ప్రజల కష్టాలు, అవసరాలు తెలుసుకుని పరిష్కార మార్గాలు సూచించడం ప్రతిపక్ష బాధ్యత. కానీ బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. విమర్శలు చేయడమే కాకుండా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలి" అని సీతక్క సూచించారు.రైతు సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. దేశంలో రైతు రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేశారు. గతంలో వైఎస్సార్ హయాంలో రైతులకు రుణమాఫీ అమలైందని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కూడా రైతు రుణమాఫీ హామీని అమలు చేసి రైతాంగానికి అండగా నిలిచిందని తెలిపారు.కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, పీబీసీ సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కొప్పిసెట్టి కిరణ్మయి, జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డీఆర్డీఓ శ్రీలత, ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, ఈఈ సుదర్శన్ రెడ్డి, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, తహసీల్దార్ జయశ్రీ, సీడీపీఓ శాంతిరేఖతో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీదే

**- మాజీ మంత్రి హరీష్ రావు**



**ఆమనగల్లు, జూన్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీ దేనని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సోమవారం అచ్చంపేటలో జరిగే కార్యకర్తల సమావేశానికి వెళ్తున్న ఆయనను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అర్జున్ రావు అధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, కౌన్సిలర్ సభ్యులు పాపిశెట్టి రాము, ఎనుమల్ల రమేష్ లతో కలిసి హరీష్ రావును శాలువాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. పార్టీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేసేంత వరకు కార్యకర్తలు విశ్రమించోద్దన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్లు శ్రీను నాయక్, శానమోని సత్యం, నాయకులు సయ్యద్ ఖలీల్, అనంతుల సైదులు గౌడ్, నిరంజన్ గౌడ్, కొమ్ము ప్రసాద్, లండం యాదయ్య, పంతు నాయక్, పరమేష్, వరకుప్పల గణేష్, రమేష్ నాయక్, గన్యా నాయక్, మహేష్, ప్రశాంత్ నాయక్, గోపి, మీసాల వర్షిత్, యాదగిరి తదితరులు ఉన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

**- మాజీ మంత్రి హరీష్ రావు**



**ఆమనగల్లు, జూన్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సోమవారం అచ్చంపేటలో జరిగే కార్యకర్తల సమావేశానికి హైదరాబాద్ నుండి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డితో కలిసి హరీష్ రావు వెళ్తుండగా మార్గమధ్యలో కడ్తాల పట్టణంలో ఉన్న ఆగ్రో ఎరువుల దుకాణం వద్ద రైతులతో ముచ్చటించారు. రైతుబంధు వస్తుందా అని రైతులను అడిగి తెలుసుకోగా రైతుబంధు ఎకరా నుంచి రెండు ఎకరాల వరకే వేయడం జరిగిందని యూరియాకు అష్ట కష్టాలు పడుతున్నామని రైతులు తెలిపారు. యాప్ ద్వారా యూరియా నమోదు వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు హరీష్ రావుతో అన్నారు. పాల బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాడి రైతులు హరీష్ రావుకు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డనంటూ రైతులను తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారని ఆయన అన్నారు. రైతు బంధు బంద్ చేశారు. రైతు బీమా భోగసయ్యింది. కెసిఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా, కరెంటు వంటి పథకాలు సక్రమంగా రాష్ట్రంలో అమలు చేయడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలం చెందారని ఆయన ఆరోపించారు. హరీష్ రావు వెంట డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, నాయకులు జోగు వీరయ్య, సర్పంచ్ గోపాల్, గంప శ్రీనివాసులు, రామకృష్ణ, జగదీశ్వర్, శ్రీకాంత్, అమృతం పాండు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## తిరుమలను దర్శించుకున్న గుర్రం కేశవులు



**ఆమనగల్లు, జూన్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సోమవారం ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుర్రం కేశవులు దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు నిర్వహించారు. కల్వకుర్తి నియోజకవర్గ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు గుర్రం కేశవులు తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు బిక్కుమాండ్ల రమేష్ ఉన్నారు.

## అంగన్వాడీల్లో ఆటపాటలతో విద్యాబోధన

**- కౌన్సిలర్ నాగిళ్ల జగన్**




**ఆమనగల్లు, జూన్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అంగన్వాడీలో ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్నట్లు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ అన్నారు. సోమవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు 2వ సెంటర్లో అమ్మమాట అంగన్వాడీ' కార్యక్రమంలో భాగంగా బడిబాట సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ జగన్ హాజరై మాట్లాడారు.. 3ఏళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు ఉచితంగా యూనిఫాంలు కూడా ఇస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారాన్ని అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సంధ్య, రాజ్యలక్ష్మి, నూర్, నిషా మరియు కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కడ్తాల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**- క్యామ రాజేష్**



**ఆమనగల్లు, జూన్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రంలో సోమవారం జరిగిన నూతన ఎంపీడీవో కార్యాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ను రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో కీలకంగా ఉన్న కడ్తాల్ మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జూనియర్ కళాశాల, మినీ స్టేడియం, గ్రంథాలయ భవనం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సీతక్క వినతిపత్రాన్ని స్వీకరించి సానుకూలంగా స్పందించినట్లు క్యామ రాజేష్ తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, యువజన కాంగ్రెస్ నాయకులు మూడ రవి, పవన్ కళ్యాణ్, గిరి, మణికంఠ, దర్శన్, వాహెబ్, శ్రీను, రమేష్, శ్రీకాంత్, ప్రవీణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల చేరికతో కాంగ్రెస్ బలోపేతం

**శివపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు సమక్షంలో చేరికలు**

**ఎలిగేడు, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మున్సిపల్ 13, 14, 15వ వార్డులకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు చొప్పరి శ్రీను, కార్యదర్శి కంకణాల సతీష్, ఉస్తం లక్ష్మీనారాయణ, కలవేణి శంకర్, కంకణాల శ్రీనివాస్, కంకణాల రాకేశ్, బొజ్జ రాజు, బండి రాజు కుమార్, చొప్పరి సంతూ, సాయితో పాటు మరో 25 మంది నాయకులు సోమవారం ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన విజయరమణారావు మాట్లాడుతూ, "సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చూసి, నేను నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని గమనించి నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ అండగా ఉంటారు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పద్మ, అబ్బయ్య గౌడ్, సిద్ది తిరుపతి, గాజువాక మంజుల రవి తదితరులు పాల్గొన్నారు.





వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారిని కండువా కప్పి ఆహ్వానిస్తున్న తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

# ఎలిగేడు మండలంలో యూరియా అందుబాటులో

**రైతులకు భరోసా కల్పిస్తున్న వ్యవసాయ శాఖ**



**ఎలిగేడు, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ ప్రైవేట్ షాపుల్లో రైతులకు అవసరమైన 3140 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. సోమవారం ఆయన గోదాములలో యూరియా నిల్వలను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "రైతులు తమ పంట వివరాలను తప్పనిసరిగా ఫర్టిలైజర్ యాప్లో నమోదు చేసి యూరియా బుక్ చేసుకోవాలి" అని సూచించారు. అదనంగా, నేడు ధూళికట్ట రైతు వేదికలో నిర్వహించే విత్తనమేల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి చేతుల మీదుగా యూనియన్ బ్యాంక్ ప్రారంభం



**తలకొండపల్లి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టిప్పలపల్లి గ్రామంలో యూనియన్ బ్యాంక్ నూతన శాఖ కార్యాలయం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే కాసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జాతీయ బీసీ మాజీ కమిషన్ తల్లోజు ఆచారి కలిసి ప్రారంభించారు. ఈ చారిత్రాత్మక వేడుకలో కాంగ్రెస్ కుటుంబ సభ్యులు, మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బ్యాంక్ శాఖ ఏర్పాటు కల సాకారం కావడంతో గ్రామ ప్రజలు, మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ, "గట్టిప్పలపల్లి మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆర్థిక సేవలు మరింత చేరువయ్యాయి. గ్రామీణ అభివృద్ధికి ఈ బ్యాంక్ శాఖ ఎంతో దోహదపడుతుంది" అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు చేస్తున్న కృషికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచిందని గ్రామస్తులు అభినందించారు.

## సర్కారు పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**- కౌన్సిలర్ పాపిశెట్టి రాము**




**ఆమనగల్లు, జూన్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రభుత్వ ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మండల ప్రీ ప్రైమరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు మమత అధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ పాపిశెట్టి రాము, ఎంఈఓ పాండు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అర్హత, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారన్న విషయాన్ని ప్రజలకు నచ్చజెప్పి పిల్లలను ప్రభుత్వ బడిబాట పట్టించే బాధ్యతను ఉపాధ్యాయులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ద్వారా విద్యాబోధన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ భాస్కర్, శ్రీదేవి, లలిత పరమేశ్వరి మరియు విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్ డివిజన్‌లో విత్తన మేళా ప్రారంభం

**ఆమనగల్లు, జూన్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు డివిజన్ పరిధిలోని ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల మండలాల రైతు వేదికల్లో జూన్ 23 నుంచి 30 వరకు విత్తన మేళా నిర్వహించనున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు అన్ని రకాల విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 23న తలకొండపల్లి రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని ఆమె కోరారు.

# లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు.



నిరుపయోగంగా ఉన్న జనరల్ కమ్యూనిటీ హాల్



సగం పిల్లల వరకే పరిమితమైన షెడ్డు

**నిరుపయోగంగా జనరల్ కమ్యూనిటీ హాల్.**

**ఎలిగేడు, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలో 23 లక్షల రూపాయల నిధులతో 2021--22 ఆర్థిక సంవత్సరంలో నిర్మించిన జనరల్ కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా వదిలివేయబడింది. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహాలు, శుభకార్యాలు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా, సురక్షిత వాతావరణంలో జరగాలని ఉద్దేశించి కేసీఆర్ ప్రభుత్వం ఈ హాల్‌ను నిర్మించింది. ఈ కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వస్తే పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు భావిస్తున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్ అద్దెకు తీసుకోలేని పరిస్థితుల్లో అప్పులపాలు కాకుండా, తక్కువ ధరలకు ఈ హాల్ వినియోగం సాధ్యమవుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. అయితే ఇప్పటికీ మౌలిక సదుపాయాలు -- మంచినీరు, విద్యుత్, వసతి గృహాలు -- ఏర్పాటు చేయకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. 2024 ఆర్థిక సంవత్సరంలో కమ్యూనిటీ హాల్ ముందు భాగంలో ఓపెన్ షెడ్ నిర్మాణానికి 25 లక్షల డీఎంఎఫ్‌టి నిధులు మంజూరు చేసి పిల్లర్లు నిర్మించారు. కానీ నిధులు నిలిపివేయడంతో పనులు ఆగిపోయాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు మాట్లాడుతూ, "వివాహాలు, శుభకార్యాలను గౌరవంగా జరుపుకునేందుకు ఈ కమ్యూనిటీ హాల్ తక్షణమే అందుబాటులోకి రావాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలి" అని విజ్ఞప్తి చేశారు.

# యువత ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి

**వ్యాపారంలో నాణ్యతే విజయానికి మూలం -- జెట్టి హరికృష్ణ**

**కల్వకుర్తి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** యువత అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని, వ్యాపార రంగంలో స్థిరపడటానికి వినియోగదారుల నమ్మకం పొందడం అత్యంత అవసరమని యువజన కాంగ్రెస్ నాయకుడు జెట్టి హరికృష్ణ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో ఇండియన్ గ్యాస్ ఆఫీస్ సమీపంలో పడగాల మహేందర్ ప్రారంభించిన బ్యాటరీ ఎలక్ట్రికల్ వర్క్స్ షాప్లో ఆయన పాల్గొన్నారు.



ఈ సందర్భంగా మహేందర్‌ను శాలువాతో సత్కరించి, "వ్యాపారం నాణ్యత ప్రమాణాలను పాటిస్తే లాభసాటిగా సాగడమే కాకుండా వ్యాపార వృద్ధి కూడా సాధ్యమవుతుంది. యువత కృషి, పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో భారతీయులు ఎక్కువగా

# ఖర్చు చేసేది వీటి కోసమే..!

**న్యూఢిల్లీ జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఒకప్పుడు కొత్త ఫోన్, టీవీ, ఫర్నీచర్ కొనడం అనేవి ముఖ్యమైన విషయాలు. ఇప్పుడు మాత్రం చాలామంది డబ్బును వస్తువుల కంటే అనుభవాల కోసం ఖర్చు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రయాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. రాబోయే ఐదేళ్లలో ఈ ధోరణి మరింత బలపడనుందని రియల్ ఎస్టేట్ సేవలు, పెట్టుబడుల సంస్థ సీబీఆర్ఈ రిసెర్చ్ అధ్యయనం చెబుతోంది. 2030 నాటికి భారతీయులు వస్తువుల కంటే అనుభవాలపైనే ఎక్కువగా ఖర్చు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నది. ఈ నివేదిక ప్రకారం.. 2025-2030 మధ్య కాలంలో భారతీయుల అనుభవాలపై (ఎక్స్‌పీరియెన్సెస్) ఖర్చు వేగంగా పెరగనుంది. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, పర్యటనలపై వ్యయం వార్షికంగా 10.3 శాతం వృద్ధి రేటుతో



పెరుగుతుందని అంచనా వేసింది. ఇక భౌతిక వస్తువులపై ఖర్చు 9.1 శాతం వృద్ధి రేటుతో పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా హోటల్ వసతి ఖర్చులు 10.6 శాతం వృద్ధితో మరింత వేగంగా పెరుగుతాయని నివేదిక పేర్కొన్నది. ఈ మార్పునకు ప్రధాన కారణం జెన్‌జీ తరమేనని నివేదిక వెల్లడించింది. సోషల్ మీడియాలో పంచుకునేలా ప్రత్యేక అనుభవాలు, ఆకర్షణీయమైన ప్రదేశాలు, స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే హోటళ్లకు యువత ప్రాధాన్యం ఇస్తోంది. సాధారణ వసతి కంటే ప్రత్యేక అనుభూతిని అందించే లైఫ్‌స్టైల్ హోటళ్లకు డిమాండ్ పెరుగుతోంది. వైన్ టేస్టింగ్, సంగీత కార్యక్రమాలు, స్థానిక కళా ప్రదర్శనల వంటి కార్యక్రమాలు నిర్వహించే హోటళ్లను యువ పర్యాటకులు ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో 2015 నుంచి 2025 మధ్య మొత్తం హోటళ్ల సంఖ్య 5 శాతం వృద్ధిరేటుతో పెరిగితే, లైఫ్‌స్టైల్ హోటళ్లు 19 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2030 వరకు కూడా ఈ విభాగం వేగంగా విస్తరించే అవకాశముందని నివేదిక తెలిపింది. భారత్‌లో ఈ తరహా హోటళ్ల సంఖ్య ఇంకా తక్కువగానే ఉండటంతో పెట్టుబడిదారులు, డెవలపర్లకు విస్తృత అవకాశాలు ఉన్నాయని విశ్లేషించింది. ఇప్పటికే ఉన్న హోటళ్లను ఆధునిక లైఫ్‌స్టైల్ హోటళ్లుగా మార్చే ధోరణి కూడా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నది.

## నటుడు ప్రకాష్‌రాజ్‌కు

# నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్

- -ఒకే వ్యక్తికి నాలుగు ఓటరు కార్డులు
- -ప్రజాప్రాతినిధ్య చట్టం ఉల్లంఘనపై కోర్టుకు
- -సమన్లు బేఖాతరు చేయడంపై న్యాయస్థానం ఆగ్రహం
- -నటుడి అరెస్టుకు పోలీసుల రంగసిద్ధం

**న్యూఢిల్లీ జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రముఖ బహుభాషా నటుడు, సామాజిక రాజకీయ విమర్శకుడు ప్రకాష్‌రాజ్ చుట్టూ వివాదం నెలకొన్నది. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓటరు గుర్తింపు కార్డులు ఉండకూడదనే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనే కేసులో ఆయనకు గట్టి షాక్ తగిలింది. బెంగళూరు లోని 48వ ఏసీజేఎం కోర్టు శనివారం ప్రకాష్‌రాజ్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేస్తూ సంచలన ఆదేశాలు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... ప్రకాష్‌రాజ్‌కు ఒకే సమయంలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఓటరు గుర్తింపు కార్డులు



ఉన్నాయంటూ 2019లో దిలీప్ కుమార్ అనే న్యాయవాది బెంగళూరు హలసూరు గేట్ పోలీస్ స్టేషన్‌లో తొలిసారి ఫిర్యాదు చేశారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయనకు ఓటు హక్కు ఉందని, ఇది ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చట్టవిరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ అక్రమ ఓట్ల వ్యవహారంపై బృహత్ బెంగళూరు మహానగర పాలిక అధికారులకు, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సదరు న్యాయవాది ఏకంగా కోర్టును ఆశ్రయించారు. ఈ ప్రైవేట్ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం గత కొన్ని విచారణలుగా కోర్టుకు స్వయంగా హాజరుకావాలంటూ ప్రకాష్‌రాజ్‌కు సమన్లు జారీచేసింది. అయితే కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రకాష్‌రాజ్ వరుసగా కోర్టు విచారణలకు గైర్హాజరవుతూ వచ్చారు. కోర్టు సమన్‌లు లైట్ తీసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. ఈసారి ఆయనకు ఎలాంటి బెయిల్ దొరకకుండా నేరుగా నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇష్యూ చేశారు. దాంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## భారత్ నుంచి బ్రహ్మోస్ క్షిపణులను

# కొనుగోలు చేయనున్న యూఏఈ..!

**న్యూఢిల్లీ జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత దేశం తన ప్రతిష్ఠాత్మక బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణి ఆకాశ్‌తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కి విక్రయించే దిశగా చర్చలు జరుపుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తమ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు యూఏఈ ఆసక్తి కనబరుస్తున్న తరుణంలో ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాయిటర్స్ మీడియా సంస్థ కథనం ప్రకారం.. ఈ చర్చలు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నప్పటికీ వేగంగా ముందుకు సాగుతున్నాయి. భారత్-రష్యాల సంయుక్త భాగస్వామ్యంలో అభివృద్ధి చేసిన బ్రహ్మోస్, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన క్రూయిజ్ క్షిపణులలో ఒకటిగా గుర్తింపు పొందింది. శబ్దవేగం కంటే మూడు రెట్లు వేగంతో (మాక్ 3) ప్రయాణించగల ఈ క్షిపణిని భూమి, సముద్రం,




గగనతలం నుంచి ప్రయోగించవచ్చు. దీని పరిధి సుమారు 290 కిలోమీటర్లు. ఇక భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ అభివృద్ధి చేసిన 'ఆకాశ్‌తీర్', గగనతలం నుంచి ఎదురయ్యే ముప్పులను వేగంగా పసిగట్టి స్పందించే అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ కంట్రోల్ వ్యవస్థ. సాంప్రదాయకంగా అమెరికా వంటి పాశ్చాత్య దేశాల నుంచి ఆయుధాలను కొనుగోలు చేసే యూఏఈ, ఇప్పుడు తన రక్షణ అవసరాల కోసం ఇతర దేశాల వైపు కూడా దృష్టి సారిస్తోంది. యూఏఈ వద్ద ఇప్పటికే అమెరికా తయారీ థాడ్, పేట్రియాట్ వంటి శక్తివంతమైన రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. వీటికి అదనంగా ఆకాశ్‌తీర్ వ్యవస్థను జోడించడం ద్వారా తమ కమాండ్ అండ్ కంట్రోల్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచుకోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బ్రహ్మోస్ జాయింట్ వెంచర్‌లో రష్యా భాగస్వామిగా ఉన్నందున ఈ విక్రయానికి మాస్కో ఆమోదం తప్పనిసరి. అయితే రష్యా-యూఏఈ మధ్య ఉన్న సత్సంబంధాల దృష్ట్యా ఇది అడ్డంకి కాకపోవచ్చని తెలుస్తోంది. ఈ చర్చలు భారత్-యూఏఈ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## ఏనుగు పేడతో కాఫీ..

# ఎంత ఖరీదో తెలుసా..?

**న్యూఢిల్లీ జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాఫీ అంటే దాదాపు అందరికీ ఇష్టం. ఉదయం ఓ కప్పు కాఫీ తో రోజును ప్రారంభించే వాళ్లు కోట్లలో ఉంటారు. కానీ ఏనుగు పేడ నుంచి సేకరించిన గింజలతో తయారు చేసిన కాఫీ గురించి చాలా మందికి తెలిసి ఉండదు. ఈ ఏనుగు పేడలోని గింజలతో తయారుచేసిన కాఫీ విలువ కూడా మామూలుగా ఉండదట. ఒక కప్పు కాఫీ ధర ఏకంగా రూ.4,700 ఉంటుందట. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇదే ప్రపంచంలో అత్యంత అరుదైన, ఖరీదైన కాఫీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. థాయ్‌లాండ్‌లో తయారయ్యే 'బ్లాక్ ఐవరీ కాఫీ' ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కాఫీ రకాలలో ఒకటి. దీని ధర కిలోకు దాదాపు 2,000 డాలర్ల వరకు ఉంటుంది. కానీ ఈ ఏనుగు పేడలోని గింజలతో తయారయ్యే ఒక్క కప్పు కాఫీ ధరే సుమారు 50 డాలర్లు.. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.4,700 కు పైమాటే. ఈ కాఫీ ప్రత్యేకత ఏంటంటే గింజలను ఏనుగుల జీర్ణవ్యవస్థ ద్వారా ప్రాసెస్ చేస్తారు. కాఫీ గింజలను బియ్యం, అరటిపండ్లు, ఇతర పండ్లతో కలిపి ఏనుగులకు ఆహారంగా ఇస్తారు. ఆహారం జీర్ణమయ్యే సమయంలో



కాఫీ గింజలు కూడా ప్రత్యేక ప్రక్రియకు లోనవుతాయి. 15 నుంచి 17 గంటల తర్వాత ఏనుగుల మల విసర్జన నుంచి ఆ గింజలను సేకరించి శుభ్రపరుస్తారు. అనంతరం వాటిని ప్రాసెస్ చేసి కాఫీ తయారు చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల కాఫీకి ప్రత్యేకమైన రుచి, సువాసన వస్తుందని కాఫీ ప్రియులు చెబుతున్నారు. ఈ కాఫీ తయారీ ప్రక్రియ చాలా నెమ్మదిగా సాగుతుంది. గింజల సేకరణ నుంచి ప్రాసెసింగ్ వరకు ప్రతి దశలో అధిక శ్రమ అవసరం. అలాగే ఉత్పత్తి పరిమితంగా ఉండటం కూడా ధర పెరగడానికి కారణం. కాఫీలో చాక్లెట్, నట్స్, మట్టి వాసనల మిశ్రమ రుచి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడం అందరి బాధ్యత

-దాతల సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**మహబూబాబాద్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎంపీపీ ఎస్ కొమ్ముగూడెం పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయుడు సోమ రవి తన మిత్రుడు కదారి ధీరజ్ (సాఫ్ట్వేర్) సహకారంతో రూ.7000 విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయుడు సోమ రవి సోదరి ప్రియదర్శిని (ఎమ్మార్వో) రూ.5000, ప్రధానోపాధ్యాయురాలు శివలక్ష్మి రూ.5000, గ్రామానికి చెందిన సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ బోనోతు శ్రీను రూ.3000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాలోతు శైలజ మంగీలాల్, ఉపసర్పంచ్ బానోతు వెంకన్న, వార్డు సభ్యులు బి. బాలు, బి. సతీష్, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్ సంగీత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుపై దాడి అమానుషం

నిందితులను వెంటనే అరెస్టు చేయాలని టియూడబ్ల్యూజే--ఐజేయూ డిమాండ్



**మెదక్, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు గ్రామపంచాయతీ నోటీసులు జారీ చేసిన వార్త రాసినందుకు మన తెలంగాణ నార్సింగి విలేకరి రాఘవేంద్రపై సోమవారం జరిగిన దాడిని టియూడబ్ల్యూజే--ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్ చారి తీవ్రంగా ఖండించారు. ఈ విషయమై ఆయన యూనియన్ నాయకులతో కలిసి నార్సింగి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "పత్రికా స్వేచ్ఛను హరిస్తూ నిజాలు వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులపై దాడులు హేయనీయమైనవి. దాడికి పాల్పడిన వ్యక్తులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలి" అని డిమాండ్ చేశారు. అదనంగా, మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లు, తహసీల్దార్ కార్యాలయాల్లో యూనియన్ తరపున ఫిర్యాదులు చేయాలని పిలుపునిచ్చారు. "పోలీసులు కాలయాపన చేసి నిందితులను అరెస్టు చేయడంలో జాప్యం చేస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి శ్రీనివాస్ శర్మ, ఐజేయూ సభ్యులు కే. శ్రీనివాస్ మిన్పూర్, రామాయంపేట జర్నలిస్టులు సత్యనారాయణ, మల్లేశం, జిల్లా నాయకులు రమేష్ గౌడ్, భైరవరెడ్డి, యాదగిరి, మన తెలంగాణ జిల్లా ప్రతినిధి ఎస్. నర్సింహా చారి, అరుణ్, అనిల్, సలీం, రాచర్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

14వ వార్డు కౌన్సిలర్ భావండ్ల మంజుల మధు పరామర్శ



**కల్వకుర్తి, జూన్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డు సిల్లార్పల్లికి చెందిన నాప శివ (32) ఆదివారం అకస్మికంగా మృతి చెందాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న 14వ వార్డు కౌన్సిలర్ భావండ్ల మంజుల మధు సోమవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చి, తక్షణ ఆర్థిక సహాయం కింద ?15,000 అందజేశారు. అతి చిన్న వయసులో మృతి చెందడం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆరవ వార్డు కౌన్సిలర్‌గా బీజేపీ తరఫున పోటీ చేసిన నాప శివ దురదృష్టవశాత్తు మృతి చెందడం పట్ల విచారం వ్యక్తమైంది. ఈ సందర్భంగా నాప శివ కుటుంబాన్ని ఆదుకోవడం పట్ల సిల్లార్పల్లి గ్రామ ప్రజలు కౌన్సిలర్ భావండ్ల మంజుల మధుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుడుముల మనోహర్ రెడ్డి, గన్నోజు బాబీ, దేవ్ రాధాకృష్ణ, మల్లేష్, శేఖర్, అంజయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.